సాక్షి నిజామాబాద్

సోమవారం, 9, అక్టోబర్, 2023



సోయా వ్యాపారుల సిండికేట్

సోయా వ్యాపారులు సిండికేట్‌గా మారి పంట ధరను తగ్గించేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

- 8లో ▸



క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని, ప్రతి ఒక్కరికీ క్యాన్సర్‌పై అవగాహన ఉండాలని ఏసీపీ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0 /22.2

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం పాక్షికంగా మేఘావృతం కావచ్చు. పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్

బోధన్ : సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్ జీపీ నూతన భవనం ప్రారంభోత్సవ విషయంలో సర్పంచ్ తూము అంజమ్మ ప్రొటోకాల్ పాటించలేదనే కారణంతో జిల్లా పంచాయతీ శాఖ శనివారం షోకాజ్ నోటీస్ జారీ చేసింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సర్పంచ్ ఈ నెల 6న ప్రొటోకాల్ ప్రకారం అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండానే జీపీ భవనాన్ని ప్రారంభించారని, దీనికి సంబంధించి ఏడు రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని శాఖ పేర్కొంది.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా



రెంజల్(బోధన్) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు డీసీపీ జయరాజ్ పేర్కొన్నారు. మండలంలోని కందకుర్తి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆదివారం సందర్శించారు. సరిహద్దున ఉన్న మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా పరిధిలోని గోదావరి వంతెన అవతలి పక్కన అక్కడి పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించారు.

చర్మకారులకు ఉపాధి కల్పించడంలో విఫలం




ఆర్మూర్ : పాలకుల చిత్తశుద్ధి లేమితో ఆర్మూర్‌లోని మినీ లెదర్ పార్క్ నిరుపయోగంగా మారిందని, చర్మకారులకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్ ఆరోపించారు. పట్టణ శివారులోని యానం గుట్ట వద్ద 20 ఏళ్ల క్రితం నిర్మించిన లెదర్ పార్క్‌ను కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నిధులు మంజూరైనా సమన్వయ లోపంతో పథకం పనులు ముందుకు సాగలేదన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి చిత్తశుద్ధిలో లేమితోనే లెదర్ పార్క్ నిరుపయోగంగా మారిందన్నారు. చెన్నైలో శిక్షణ పొందిన చర్మకారులు ప్రస్తుతం రోడ్లపై చెప్పులు కుట్టుకుంటూ దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించి చర్మకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మీర్ మాజిద్, జిమ్మి రవి, అజ్జు, ఫయాం, మీసాల రవి, అబ్దుల్ బారి, మెహబూబ్, శ్రీకాంత్, హబీబ్, ఉస్మాన్, పెద్ద పోశెట్టి, ప్రసాద్, పాషా, అభిమన్యు, మల్లికార్జున్ తదితరులున్నారు.

ప్రధాని మోదీ రైతు బాంధవుడు



సుభాష్‌నగర్ : రైతుల సంక్షేమమే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారని, ఆయన రైతు బాంధవుడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో పసుపుబోర్డు సాధన కోసం 12 ఏళ్లు కాళ్లకు చెప్పులు వేసుకోకుండా తిరిగిన ముత్యాల మనోహర్‌రెడ్డి కాళ్లను పాలతో కడిగి సన్మానించారు. అంతకుముందు ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వరికి రూ.2,203 మద్దతు ధర రైతులకు అందజేస్తున్నారన్నారు. పసుపు బోర్డు కోసం ఈ ప్రాంత రైతుల ఆకాంక్షలను మోసిన ముత్యాల మనోహర్‌రెడ్డి 12 ఏళ్లపాటు చెప్పులు లేకుండా ఆదిలాబాద్ నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేశారని తెలిపారు. ఆయన పోరాటం, ఎంపీ అర్వింద్ వినతిని ప్రధాని స్వీకరించి తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, యెండల సుధాకర్, సురేష్, రాథోడ్, హరిప్రసాద్, శ్రావణ్, రా జు, మారుతి, చంద్రకాంత్, గిరిబాబు పాల్గొన్నారు.

షాడో కనుసన్నల్లో సీక్రెట్ ఏజెంట్లు



- ప్రజాప్రతినిధికి తెలియకుండానే వసూళ్లు
- మచ్చతెస్తున్న బాగోతాలు
- రూ. కోట్లల్లో చేతులు మారిన కమీషన్లు

నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ నగరంలో ప్రజాప్రతినిధి ఏదైనా అభివృద్ధి కార్యక్రమానికి అంగీకారం తెలిపినప్పటికీ షాడోబాస్ కూడా ఓకే చెప్పాల్సిందే.. లేకపోతే ఆ పని అక్కడే ఆగిపోతుంది. ప్రస్తుతం ఈ సంఘటనలు నగరంలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా దళిత బంధు రెండో విడత అర్హుల జాబితా అంతా ప్రజాప్రతినిధి వెనక షాడో వ్యక్తి కనుసన్నల్లోనే జరిగింది. తన సీక్రెట్ ఏజెంట్ల ద్వారా ముందస్తుగానే పెద్దఎత్తున లక్షల్లో ముడుపుల బాగోతాన్ని నడిపించాడని చర్చించుకుంటున్నారు. ఎవరు ఎంత మొత్తంలో కమీషన్ ఇచ్చారో లెక్కరాసుకుని మరీ జాబితాను సిద్ధం చేశారని వినికిడి. 1100 మందితో కూడిన దళితబంధు రెండో జాబితాలో సుమారు 1000 మందికి పైగా లబ్ధిదారుల నుంచి ముందస్తుగా కమీషన్లు తీసుకున్నాకే పేర్లు నమోదు చేశారని సమాచారం.

రూ. 30 కోట్లకు పైనే..

దళితబంధు రెండో విడత డబ్బులు రిలీజ్ కాకముందే సదరు ప్రజాప్రతినిధి వద్ద ఉండే షాడో వ్యక్తి తన సీక్రెట్ ఏజెంట్లతో కమీషన్‌లు వసూళ్లు చేసేశారు. దళితబంధు కింద లబ్ధిదారుడికి రూ.10లక్షలు వస్తుండగా ముందుగానే ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ. 3 లక్షలు, మరీ అమాయకులైతే రూ. 5 లక్షలు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో మాజీ డివిజన్ ప్రజాప్రతినిధులకే కాకుండా, ప్రస్తుత డివిజన్ ప్రజాప్రతినిధులు కూడా తమవారి పేర్లు దళితబంధు లిస్ట్‌లో చేర్చేందుకు షాడోకు ముందుగానే కమీషన్లు ఇచ్చేశారు. మొదటి విడతలో 100 మంది లబ్ధిదారుల్లో రూ. 3 కోట్ల వరకు వసూలు చేస్తే, రెండో విడత 1100 మంది లబ్ధిదారుల వద్ద సుమారు రూ. 30 కోట్లకు పైనే వసూళ్లు చేశారని అధికార పార్టీ నాయకులే చర్చించుకోవడం గమనార్హం. ప్రజాప్రతినిధికి షాడోనే పక్కనుంచి మచ్చతెస్తున్నా గుర్తించలేకపోతున్నాడని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

- నగరంలో రాములు (పేరుమార్చాం)అనే వ్యక్తి తనకు సంబంధించిన డివిజన్ కార్పొరేటర్ వద్దకు వెళ్లి దళిత బంధు విషయంపై విన్నవించుకున్నారు. సదరు కార్పొరేటర్ నాకు రూ. 7 లక్షలు, నీకు రూ. 3 లక్షలు అయితేనే నీ పేరు జాబితాలో పెట్టిస్తానన్నాడు. ఇదేం బాగోలేదని మరో కీలక నాయకుడిని సంప్రదిస్తే నీకు రూ. 5 లక్షలు, నాకు రూ. 5 లక్షలు అని ఒప్పందం చేసుకున్నాడు. నీవు ఎక్కడికి వెళ్లినా ఇదే పరిస్థితి అని దబాయించాడు సదరు నాయకుడు. దీంతో ఏమీ చేయలేని స్థితిలో రాములు సరేనన్నాడు. ఇలా దళితబంధు విషయంలో నగరంలో కమీషన్ దందా నడుస్తోంది.

ముందుగానే డబ్బులు..

సదరు ప్రజాప్రతినిధికి మచ్చ తెస్తున్న షాడో వ్యక్తి ఈసారి నేరుగా కాకుండా సీక్రెట్ ఏజెంట్ల వ్యవస్థను తయారు చేసుకున్నాడు. తనకు అత్యంత నమ్మకంగా ఉండే వ్యక్తులను తయారు చేసుకున్నారు. వారితోనే నగరంలోని ఆయా డివిజన్లలో దళిత బంధు రెండో విడత జాబితాను రూపొందించారు. సీక్రెట్ ఏజెంట్లు కూడా షాడో పేరు బయటకు రాకుండా క్షేత్రస్థాయిలో దళితబంధు బాగోతాన్ని చక్కబెడుతున్నారు. దళితబంధు కావాలంటే లబ్ధిదారుడితో కమీషన్‌ను ముందే మాట్లాడుకుని వసూళ్లు చేశారు. రెండు నెలలుగా ఈ సీక్రెట్ ఏజెంట్లు, షాడో వ్యక్తికి మధ్య దళితబంధు విషయంలో రూ. కోట్లల్లో వ్యవహారం నడిచిందని వినికిడి. సీక్రెట్ ఏజెంట్లతో పాటు ఇద్దరు, ముగ్గురు నాయకులు, సదరు పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జీలు సైతం షాడో గ్రూప్‌లో ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

సైన్స్ అండ్ టెక్నాలజీలో వేగంగా వృద్ధి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో మాజీ చైర్మన్, డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ జీ సతీశ్ రెడ్డి

- డీఆర్‌డీవో మాజీ చైర్మన్, డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ సతీశ్ రెడ్డి
- కాలానుగుణంగా కొత్త కోర్సులు
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి
- ట్రస్మా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

డిచ్‌పల్లి : సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం త్వరలోనే ప్రపంచ అగ్రగామిగా నిలుస్తుందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రక్షణ మంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారు జీ సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం డిచ్‌పల్లిలోని జీ కన్వెన్షన్‌లో తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ఆయన రాష్ట్ర ఉన్నత వి ద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ పా ఠశాలల్లో పని చేస్తున్న 150 మంది ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులను అందజేశారు. సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ప్రపంచంలో సాఫ్ట్‌వేర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని మన విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు.యువత స్టార్టప్ కంపెనీలు ప్రారంభించి ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు.




విద్యారంగంలో అనేక అవకాశాలు

తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యారంగంలో అనేక అవకాశాలు పెరిగాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి అన్నారు. కాలానుగుణంగా విద్యారంగంలో, సిలబస్ తయారీలో అనేక మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొన్ని కోర్సుల్లో చేరితే వారంలో 3 రోజులు కాలేజీలో, మరో 3 రోజుల్లు కంపెనీలు, పరిశ్రమల్లో పని చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వే ప్రకారం ఉన్నత విద్యలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. డీఈవో దుర్గాప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్ ప్రసంగించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు జయసింహాగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మానస గణేష్, విష్ణువర్ధన్, ఆర్‌పీ జనార్దన్, నిత్యానందం, సుందర్, గంగారెడ్డి, విక్రాంత్, గంగాధర్ పాల్గొన్నారు.

విద్యాశాఖలో వింత ధోరణి

గెజిటెడ్ హెచ్‌ఎంల బదిలీ

- ఎంఈవో బాధ్యతల నుంచి రిలీవ్ చేయని విద్యాశాఖ
- ఒక మండలంలో హెచ్‌ఎం, మరో మండలంలో ఎంఈవో
- ఒకరికైతే కామారెడ్డిలో పోస్టింగ్, నిజామాబాద్‌లో అదనపు బాధ్యతలు



మోర్తాడ్(బాల్కొండ) : ఎంఈవోలుగా కొనసాగుతున్న గెజిటెడ్ హెచ్‌ఎంలు కొందరు తాము పని చేసిన చోటు నుంచి బదిలీ అయినా ఎంఈవో బాధ్యతల నుంచి రిలీవ్ చేయలేదు. ఫలితంగా ఒక చోట గెజిటెడ్ హెచ్‌ఎంగా మరో మండలంలో ఎంఈవోగా విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఎంఈవోల పోస్టుల భర్తీ విషయంలో సాంకేతిక కారణాలను చూపుతున్న ప్రభుత్వం గెజిటెడ్ హెచ్‌ఎంలకే అదనపు బాధ్యతలను అప్పగించింది. ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా ఎంఈవోలుగా పని చేస్తున్న గెజిటెడ్ హెచ్‌ఎంలు ఇటీవల బదిలీ అయ్యారు. వారిని పాఠశాల విధుల నుంచి రిలీవ్ చేసినా ఎంఈవో బాధ్యతల నుంచి తప్పించలేరు. దీంతో విధుల నిర్వహణ భారంగా మారిందనే వాదన వినిపిస్తుంది. మాక్లూర్ మండల ఎంఈవోగా పని చేస్తున్న రాజగంగారెడ్డి కామారెడ్డి జిల్లా భిక్కనూర్ హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. ఆయన అక్కడ ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూ దాదాపు 90 కి.మీ దూరంలో ఉన్న మాక్లూర్ ఎంఈవోగా అదనపు బాధ్యతలను నిర్వహించాల్సి ఉంది. ఇది ఎలా సాధ్యమైతుందనే సంశయం వ్యక్తమైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు నోరుమెదపక పోవడం గమనార్హం. అలాగే నందిపేట్ ఎంఈవోగా కొనసాగుతున్న శ్రీనివాస్‌రెడ్డి జక్రాన్‌పల్లి మండలం లక్ష్మాపూర్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. వేల్పూర్ ఎంఈవోగా పని చేస్తున్న వనజ అంక్సాపూర్ ఉన్నత పాఠశాల నుంచి ఆర్మూర్ బాలికల ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంగా బాధ్యతలను చేపట్టారు. ఆమె ఇక్కడ విధులు నిర్వహిస్తూనే వేల్పూర్ మండలంలో అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది.

ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలి



ఎంఈవో పోస్టులను భర్తీ చేయడంలో నిర్లక్ష్యంతోనే గెజిటెడ్ హెచ్‌ఎంలపై పని భారం అధికం అవుతోంది. ఇటీవల బదిలీపై వెళ్లిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను ఎంఈవో పోస్టుల నుంచి రిలీవ్ చేయకపోవడం సరైంది కాదు. మరో గెజిటెడ్ హెచ్‌ఎంకు ఎంఈవో బాధ్యతలను అప్పగిస్తే బాగుంటుంది.

– సత్యానంద్, టీఎస్‌యూటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు

మంత్రి అక్రమాలకు అంతే లేదు..

- రూ. కోట్లల్లో అడ్డంగా దోపిడీ
- ఆయన సంపదకు హక్కుదారులు బాల్కొండ ప్రజలే..
- కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి



మంత్రి అవినీతి, అక్రమాలపై ఛాయాచిత్ర ప్రదర్శన సందర్భంగా మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌రెడ్డి

మోర్తాడ్ : బాల్కొండ నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రి ప్రశాంత్‌రెడ్డి అక్రమంగా కూడబెట్టిన సంపదపై ఈ నియోజకవర్గంలోని ప్రజలకు పూర్తి హక్కు ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి స్పష్టం చేశారు. సహజ వనరులను హరింపజేసి, కమీషన్ల కోసం తప్పుడు పనులు చేసి దండిగా అక్రమాలకు పాల్పడిన మంత్రి రూ. కోట్లల్లో అడ్డంగా దోచుకున్నారని ఆయన ఆరోపించారు. మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో ఆదివారం బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఛాయాచిత్ర ప్రదర్శన, వీడియో ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ చెక్‌డ్యాంలను రైతుల కోసం నిర్మించలేదని కేవలం తమ కమీషన్ల కోసమేనన్నారు. చెక్‌డ్యాంలు కూలిపోయి, కట్టలు తెగిపోయి రైతుల పంటలు నీట మునిగితే మంత్రి ఒక్కచోట కూడా పరిశీలించలేదన్నారు. తమ తప్పు ఎక్కడ బయటపడుతుందోనని చెక్‌డ్యాంల వల్ల జరిగిన నష్టం వైపు మంత్రి కన్నెత్తి చూడలేదన్నారు. ఏర్గట్ల మండలం బట్టాపూర్ కంకర క్వారీ వద్ద నామమాత్రంగా అనుమతులు పొంది వందరేట్లు ఎక్కువ కొల్లగొట్టి ప్రజాధనం మొత్తం తన జేబులో వేసుకున్నాడని ఆరోపించారు. తమ సమీప బంధువుతో ఈ క్వారీ నిర్వహించారని చివరకు కోర్టు జోక్యంతో మూతబడిందన్నారు. సెంట్రల్ లైటింగ్ ఎక్కడ కూడా పూర్తిస్థాయిలో వెలుగడం లేదని నాసిరకం పనులే ఇందుకు కారణమన్నారు. గంజాయి మత్తును యువతకు అలవాటు చేసి ప్రశ్నించేవారు ఉండకూడదని మంత్రి జాగ్రత్త పడ్డారని ఆరోపించారు. ఎంతోమంది యువతను చెడుమార్గంలో ప యనించేలా చేసిన మంత్రి యువత కన్నతల్లులకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి అంతా మేడిపండు చందంలాగా ఉందన్నారు.





కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛాయాచిత్ర ప్రదర్శనలో 'సాక్షి' కథనాలతో కూడిన ఫ్లెక్సీలు

'సాక్షి' కథనాల సమూహం..

బాల్కొండ నియోజకవర్గంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై నిర్వహించిన ఛాయాచిత్ర ప్రదర్శనలతో 'సాక్షి'లో ప్రచురితమైన అనేక కథనాలు కనిపించాయి. 'సాక్షి'లో ప్రజా సమస్యలను ఏకరువు పెట్టగా వాటిని కాంగ్రెస్ నాయకులు సేకరించి ఛాయాచిత్ర ప్రదర్శనలో చోటు కల్పించడం విశేషం.

దేవుడి సొత్తుకు భద్రత కరువు

- నైట్‌వాచ్‌మెన్‌ల నియామకం లేదు
- దొంగల పాలవుతున్న హుండీలు
- 17 ఆలయాలకు భారీ ఆదాయం



ఇటీవల చోరీ జరిగిన నందిపేట మండలం కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయం

నిజామాబాద్ సిటీ: దేవుడి సొత్తుకు భద్రత కరువైంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఒకటీరెండు మినహా ప్రసిద్ధ ఆలయాలకు నైట్ వాచ్‌మెన్లు లేకపోవడంతో రక్షణలేకుండాపోయింది. ఆలయాల్లో చొరబడుతున్న దొంగలు ఉన్నకాడికి దోచుకుపోతున్నారు. ఇదిలా ఉండగా, ఎండోమెంట్ పరిధిలోని ఆలయాల్లో చోరీలు మామూలువిషయంగా మారిపోయింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1359 ఆలయాలు ఉండగా, నిజామాబాద్ జిల్లాలో 758, కామారెడ్డి జిల్లాలో 601 ఆలయాలు ఉన్నాయి. ఇందులో 6(ఏ) కింద ఆరు ఆలయాలు ఉండగా.. వీటికి భక్తుల ద్వారా విరాళాలు, కానుకలు, హుండీ రూపంలో ఏడాదికి రూ.కోటి వరకు, 6(బి) కింద ఉన్న 11 ఆలయాలకు రూ. 25 లక్షల వరకు ఆదాయం సమకూరుతున్నది. 6(సీ) కింద 1340 ఆలయాలు, 6(డి) కింద రెండు మఠాలు ఉన్నాయి. 384 ఆలయాలకు 4,153.25 ఎకరాల మాన్యం ఉంది. 22 ఆలయాలు భూములను కౌలుకు ఇస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 17 ఆలయాలకు లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతున్నది. అయితే ఒకటీరెండు మినహా ఏ ఆలయానికి నైట్‌వాచ్‌మెన్ లేకపోవడంతో భద్రత కరువైంది. పలుచోట్ల నైట్‌వాచ్‌మెన్లుగా ఉన్న వారిని అక్కడి ఆలయ కమిటీలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నవారే. లక్షల్లో ఆదాయం ఉన్న ఆలయాలకు, హుండీ డబ్బుల రక్షణకు నైట్‌వాచ్‌మెన్లను నియమించాలని భక్తులు కోరుతున్నారు.

తరచూ చోరీలు

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని లక్ష్మీనరసింహ స్వామి, నందిపేట్ మండలంలోని కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయాల్లో తరుచూ చోరీలు జరుగుతుంటాయి. ఇప్పటి వరకు లక్షలాది రూపాయల దేవుని సొత్తు దొంగలపాలైంది. ఈ రెండు ఆలయాలు గుట్టల ప్రాంతంలో ఉండటంతో రాత్రివేళల్లో అక్కడ ఉండటం సాధ్యం కాదు. బోధన్ పట్టణంలోని మారుతి మందిరంలో నెలరోజుల క్రితం దుండగులు చోరీకి యత్నించారు. దొంగలు ఆలయ తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించగా, సీసీ కెమెరాలో గమనించిన పూజారులు కేకలు పెట్టడంతో పారిపోయారు.

ప్రభుత్వానికి లేఖ రాశాం

ఉమ్మడి జిల్లాలో మొత్తం 17 ఆలయాలకు లక్షల నుంచి కోటి వరకు ఆదాయం సమకూరుతున్నది. ఈ ఆలయాలకు నైట్ వాచ్‌మెన్లను నియమించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్ప ఆలయాలకు నైట్ వాచ్‌మెన్లు పెట్టలేం. ప్రముఖ ఆలయాల్లో హుండీలు చోరీ కాకుండా ఏర్పాట్లు చేశాం.

– ఎస్ సుప్రియ, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్

సైనికుడా సెల్యూట్..

- అశేష జనవాహిని మధ్య ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ అంత్యక్రియలు
- నివాళులర్పించిన కలెక్టర్, సీపీ
- ఆర్మీ అధికారులకు జవాన్ సతీమణి కన్నీటి సెల్యూట్

బోధన్: సిక్కిం వరదల్లో ఐదు రోజుల క్రితం గల్లంతై మృతిచెందిన బోధన్ మండలంలోని కుమ్మన్‌పల్లికి చెందిన ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ అంత్యక్రియలను ఆదివారం స్వగ్రామంలో నిర్వహించారు. గల్లంతైన ఆర్మీ జవాన్ గంగా ప్రసాద్ మృతదేహం గురువారం లభ్యం కాగా శుక్రవారం పోస్టుమార్టం పూర్తి చేసి శనివారం విమానంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఆదివారం హైదరాబాద్ ఆర్మీ క్యాంప్ నుంచి వారి వాహనంలో ఆయన పార్థివ దేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఉదయం బోధన్ పట్టణ శివారులోని ఆచన్‌పల్లి నుంచి రాజకీయ నాయకులు, ప్రజలు భారీ ర్యాలీ తీశారు. లాంఛనాల ప్రకారం ఆర్మీ అధికారులు జవాన్ పార్థివ దేహానికి గౌరవ వందనం చేయగా, జవాన్ సతీమణి శిరీష అధికారులకు సెల్యూట్ చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ, అదనపు డీసీపీ జయ్‌రాం, ఏసీపీ కిరణ్ కుమార్, ఆర్డీవో రాజాగౌడ్, రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, తహసీల్దార్ మమత, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖఅధికారి రమేశ్ పార్థివ దేహానికి సెల్యూట్ చేశారు.



కుమ్మన్‌పల్లిలో జవాన్ గంగాప్రసాద్ పార్థివదేహం వద్ద ఆర్మీ అధికారులకు సెల్యూట్ చేస్తున్న మృతుడి సతీమణి

క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్స్

డిచ్‌పల్లి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో తక్షణ ప్రవేశాల (స్పాట్ అడ్మిషన్స్)కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. బీఏ (హెచ్‌ఈపీ), బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (లైఫ్ సైన్సెస్, బీజెడ్‌సీ), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్, ఎంపీసీ, ఎంపీసీఎస్) కోర్సుల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులు 9177563723, 9705336530 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నాటుసారా కేంద్రంపై దాడులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలంలోని రాజమ్మ తండాలో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడులు చేసి నాటుసారాను ధ్వంసం చేశారు. కామారెడ్డి ఎక్సైజ్ ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం .. తండాలోని గంగవత్ గోపాల్ ఇంట్లో ఆరు లీటర్ల నాటు సారా లభించిందని, నిందితుడిపై కేసు నమోదు చేసి నాటు సారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో రామారెడ్డి ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

'రిజర్వేషన్ అమలు విధానం మార్చాలి'

తెయూ(డిచ్‌పల్లి): దేశంలో, రాష్ట్రంలో అమలవుతున్న రిజర్వేషన్ల అమలు విధానాన్ని మార్చాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తెయూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రిజర్వేషన్ల అమలు విధానంపై ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లను 27 శాతాన్ని 60శాతానికి పెంచాలని అప్పుడే వారికి సరైన న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో బీసీలకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. జనాభా ప్రతిపాదికన బీసీ రిజర్వేషన్లు పెంచితే వారికి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా లాభం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం వర్సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు శివ, సూర్య, సాయిపవన్, కృష్ణ, శ్రీకాంత్, రాంచందర్, శివకుమార్, నరేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ధనం వృథా..



బోధన్‌టౌన్(బోధన్): రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలోని గాంధీ పార్క్‌లో ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలుపక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజాధనం వృధా అవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో పట్టణంలోని శక్కర్‌నగర్, రాకాసీపేట్ రైల్వే స్టేషన్ల పరిధిలోని ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొనేది. స్పందించిన గత మున్సిపల్ పాలకవర్గం రైల్వే గేట్ సమీపంలో రూ. 17 లక్షలు వెచ్చించి రైల్వే స్టేషన్‌ను నిర్మించింది. దీంతో పాటు అదనంగా రూ. 5 లక్షలతో రైల్వే ప్లాట్ ఫాం, టికెట్స్ ఇవ్వడానికి ఒక గదిని నిర్మించారు. గాంధీ పార్క్ రైల్వే స్టేషన్ ఏర్పాటు కావడంతో రైల్వే అధికారులు శక్కర్‌నగర్ రైల్వే స్టేషన్‌ను మూసేశారు. దీంతో కొన్ని సంవత్సరాలు గాంధీ పార్క్ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలిపేవారు. టికెట్స్ సైతం ఇచ్చేవారు. బోధన్‌కు వచ్చే బోధన్–మిర్జాపల్లి, బోధన్–మహబూబ్‌నగర్ ప్యాసింజర్ రైళ్లు కరోనా కారణంగా రద్దు కావడంతో నాటి నుంచి ఈ స్టేషన్‌లో రైళ్లు నిలుపడం లేదు. దీంతో ప్రయాణికులు రాకాసీపేట్ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతున్నారు. బోధన్‌కు వచ్చే రాయలసీమ ఎక్స్‌ప్రెస్, నిజామాబాద్– కరీంనగర్, బోధన్– మహబూబ్‌నగర్ ప్యాసింజర్ రైలు ఈ స్టేషన్‌లో ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి బోధన్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే బోధన్–కరీంనగర్ ప్యాసింజర్ రైలు, పలు రైళ్లను గాంధీ పార్క్ రైల్వే స్టేషన్‌లో ఆపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సోయా వ్యాపారుల సిండికేట్..!

- క్వింటాలుకు రూ. 700 తగ్గించిన వ్యాపారులు
- ఆందోళనలో రైతులు



ముప్కాల్ మండలం రెంజర్లలో రోడ్డుపై ఆరబోసిన సోయాలు

బాల్కొండ: ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన పంటను దళారులు దోచుకెళ్తున్నారు. సోయా వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నట్టేట ముంచుతున్నారు. నాలుగు రోజుల క్రితం క్వింటాలుకు రూ. 4500 నుంచి రూ. 4700 వరకు కొనుగోలు చేశారు. రెండు రోజుల నుంచి ఒక్క సారిగా పరిస్థితిని మార్చేశారు. మార్కెట్‌లో ధర లేదంటు క్వింటాళులు రూ. 3800కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఒక్క సారిగా ఆందోళన చెందారు. నాలుగు రోజుల వ్యవధిలో క్వింటాలుకు రూ. 700 తగ్గిండంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే సీజన్ ప్రారంభంలో సోయాకు క్వింటాలుకు రూ. 4600 కొనుగోలు చేయడంతో మద్దతు ధర దక్కుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సోయా పంటకు ప్రభుత్వం రూ. 4600 మద్దతు ధరను ప్రకటించిచింది. రూ. 10 తక్కువ ధరకైనా రైతులు దళారులకే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ధర అమాంతం పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల క్రితం క్వింటాలుకు రూ. 5 వేలు పలికిన సోయా క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుత సంవత్సరం సోయా పంట సాగును కూడా రైతులు తగ్గించారు. అయినా ధర పతనం కావడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

దీనికి వ్యాపారులు సిండికేట్‌గా మారడమే అని పలువురు పేర్కొంటున్నారు. సోయా పంట సాగు ప్రారంభం నుంచి పంటకు పచ్చ పురుగు ఆశించి ఎక్కువగా ఖర్చులయ్యాయి. ముందుగా వర్షాలు కురిసి తరువాత కురువక రైతులు అపర భగీరథ ప్రయత్నాలు చేసి పంటలను సాగు చేశారు. కానీ చివరికి దళారుల చేతిలో చిక్కిపోతున్నారు. ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడాన్ని అవకాశంగా మలుచుకున్న వ్యాపారులు, దళారులు సోయా ధరను రోజు రోజుకి తగ్గిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధర తగ్గించేశారు..



సోయా ధరను రెండు రోజుల్లో రూ. నాలుగు వందలు తగ్గించారు. క్వింటాలుకు రూ. 3300కు కొనుగోలు చేస్తున్నారు. సిండికేట్ వ్యాపారులపై తీరుపై ప్రభుత్వం స్పందించారు. కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– బుయ్య నడ్పన్న, రైతు

మరింత తగ్గుతుందని..



సోయా ధర మరింత తగ్గుతుందని వ్యాపారులు తెలుపుతున్నారు. దీంతో ఆందోళన పెరుగుతోంది. క్వింటాలుకు రూ. 5 వేలు ఉంటేనే పెట్టిన పెట్టుబడి వస్తుంది. కానీ రోజు రోజుకు ధర తగ్గడంతో రైతులకు నష్టమే కలుగుతుంది.

– రాజేందర్, రైతు

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న వక్త రాజేశ్వర్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: దేశాన్ని నడిపించే యువత సన్మార్గంలో నడవాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి ఘణపురం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నగరంలోని మేరుభవన్‌లో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శౌర్య జాగరణ యాత్ర ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాగూర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ ఆనంద్, జిల్లా సహకార్యదర్శులు ధాత్రిక రమేశ్, అరుణ్ రెడ్డి, బజరంగ్ దళ్ నగర సంయోజక్ సాయి, ప్రముక్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌పల్లి వాసికి డాక్టరేట్



సిరికొండ: మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కాయిత సాల్మన్ కూతురు స్పందన ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి డాక్టర్ ఆఫ్ పిలాసపి డాక్టరేట్ పొందారు. సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న స్పందన వ్యవసాయరంగంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీ ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ సాధించిన స్పందనను ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, సీఎస్ఈ విభాగాధిపతి రమణ్ దుగ్యాల, అధ్యాపకులు అభినందించారు.

కన్నీటి సంద్రమైన కుమ్మన్‌పల్లి



బోధన్ నుంచి బైక్‌ర్యాలీగా వస్తున్న యువకులు





ఆర్మీ జవాన్ గంగాప్రసాద్ పార్థివ దేహానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్, నివాళులర్పిస్తున్న సీపీ

బోధన్: సిక్కిం వరదల్లో గల్లంతై మృతిచెందిన ఆర్మీజవాన్ గంగాప్రసాద్ అంతిమయాత్రలో భాగంగా ఆయన స్వగ్రామమైన కుమ్మన్‌పల్లి కన్నీటిసంద్రమైంది. వందల సంఖ్యలో రాజకీయ నాయకులు, ప్రజలు బైక్‌ర్యాలీగా ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్మీ జవాన్ సతీమణి శిరీష, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు కాశీరాం, సరూబాయిలను కలెక్టర్, సీపీలు ఓదార్చారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గిర్దావర్ గంగారెడ్డి, బుద్దె రాజేశ్వర్, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్ అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు.



అంతిమ యాత్రలో పాల్గొన్న జనం



రోదిస్తున్న జవాన్ సతీమణి శిరీష, పిల్లలు



జవాన్ మృతదేహంతో అంతిమయాత్ర..



తుపాకులు పేల్చి గౌరవ వందనం చేస్తున్న జవాన్లు

హైదరాబాద్ తరలిన ముదిరాజులు



భాగిర్తిపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ముదిరాజ్‌లు



బాన్సువాడ మండలం దామరంచ నుంచి..

సాక్షి నెట్‌వర్క్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు జిల్లా నుంచి ముదిరాజ్ కులస్తులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం నేతలు మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులకు జనాభా ప్రకారం చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించడానికి పార్టీలు సీట్లు కేటాయించాలన్నారు. ఆత్మగౌరవ సభలో తమ డిమాండ్లను రాష్ట్ర కమిటీ ప్రకటిస్తుందన్నారు. తమకు రాజకీయంగా పెద్ద పీట వేసేవారికే తాము ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు.



సదాశివనగర్ నుంచి ..



ఎల్లారెడ్డి నుంచి..

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1997–98 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, అమరనాథ్, శివశంకర్, విఠల్‌రెడ్డి, మైసాగౌడ్, సంజీవరెడ్డి, రమేశ్, గణేశ్, రాజమౌళి, శేఖర్, రాంకిశోర్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శంకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకట్‌స్వామి, శ్రీనివాస్, పెంటయ్య, నర్సింలు, సంతోష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): సమాజంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. క్యాన్సర్ అవేర్‌నెస్ మాసం సందర్భంగా ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రి, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 3కే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్ నుంచి ఫులాంగ్ వరకు కొనసాగింది. ర్యాలీని ఏసీపీ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అజయ్‌కుమార్, అభినవ్ సర్దార్, లోహిత్ కుమార్, డాక్టర్ ప్రతిమరాజ్, ఇందూర్ క్యాన్సర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రద్యుమ్నారెడ్డి, డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, మేనేజర్ మునీందర్‌రెడ్డి, యూపీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్, రెడ్‌క్రాస్, స్పర్శ హోస్పిస్, వసుధ ఫౌండేషన్, ఎన్‌సీసీ, మేఘనా డెంటర్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ఎస్ఎస్ఎస్, బీబీసీ స్కూల్, తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



బరంగెడ్గిలో గదులను ప్రారంభిస్తున్న స్పీకర్

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బరంగెడ్గిలో పలు అభివృద్ధి పనులను స్పీకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుషులు శాశ్వతం కాదు.. ప్రజా సమస్యలను గుర్తించి చేపట్టిన పనులు మాత్రం ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. సీఎం సూచన మేరకు రానున్న ఎన్నికల్లో తానే మరోసారి బాన్సువాడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. పండ్లు ఇచ్చే చెట్టును ప్రజలు కాపాడుకోవాలని, మంచి మనస్సుతో తనను ఆశీర్వదించాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గంలో రూ.200కోట్లతో సిద్ధాపూర్ రిజర్వాయర్, మంజీరా నదిలో 4 చోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తిలకేశ్వర్ రఘు, జెడ్పీటీసీ స్వరూప, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీశ్, కుమ్మరి గంగామణి, రాములు తదితరులు పాల్గొన్నారు.



మిర్జాపూర్‌లో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కేసీఆర్ పాలనలోనే సంక్షేమ పథకాలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): సీఎం కేసీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మిర్జాపూర్, వీరాపూర్‌లో రూ. 1.51 కోట్లతో చేపట్టిన జీపీ, పల్లె దవాఖాన, అంగన్ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో అభివృద్ధి కాలేదని తెలంగాణ వచ్చాక పరిస్థితులు మారాయని తెలంగాణ దేశంలోనే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఎదుగుతోందని అన్నారు. మిర్జాపూర్ గ్రామంలోనే రూ.35కోట్లు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పురం లక్ష్మి, సాయిరాం, ఎంపీపీ పాల్త్య విఠల్, రఘు, జెడ్పీటీసీ స్వరూప, పార్టీ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీశ్, నాయకులు మారుతి, శ్రీనివాస్, పురం వెంకటి, సందీప్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అమృతాపూర్‌లో మహిళ ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ ఒడ్డెర కాలనీకి చెందిన సంపంగి లింగవ్వ (56) బావిలో పడి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. లింగవ్వ కొద్దిరోజులుగా మతిస్థిమితం లేక అనారోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం ఉదయం స్థానిక బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం





కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారులు

నిజాంసాగర్(జుక్కల్)/ వేల్పూర్ : నిజాంసాగర్, వేల్పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో పిచ్చి కుక్కల స్వైర విహారంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కల దాడుల్లో చిన్నారులు గాయాలకు గురవుతున్నారు. మహమ్మద్‌నగర్, నర్వ గ్రామాల్లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేయడంతో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేయడంతో పాటు రోడ్లపై ఉన్న పశువులపై దాడి చేస్తున్నాయి. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో శనివారం కుక్కదాడిలో రాజారపు శ్రేయాస్ (5) అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రేయస్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క ఆకస్మికంగా దాడిచేసి తలపై తీవ్రంగా గాయపర్చిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో రోడ్లపై నడవాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పిచ్చికుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

- భార్య, కుమార్తెపై అనుమానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రంగాచారినగరి కాలనీలో పాపయ్య(45) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాపయ్య నిత్యం మద్యం డబ్బుల కోసం భార్య, కుమార్తెలను వేధించేవాడు. దీంతో విసిగిపోయిన వారు పాపయ్య నిద్రిస్తున్న సమయంలో శనివారం అర్ధరాత్రి దాడి చేసి హత్య చేశారు. హత్యను ప్రమాదశాత్తు మృతిగా చిత్రీకరించారు. ఉదయం కాలనీలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో ఆధారాలు సేకరించేందుకు జిల్లా కేంద్రం నుంచి జాగిలాన్ని రప్పించారు. జాగిలం మృతుని కుమార్తె వద్ద నిలిచిపోయింది. దీంతో మృతుడి భార్య, కూతురిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తమ్ముడు చిన్నారెడ్డి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

బాల్కొండ: ఆగిఉన్న డీసీఎంను పాలవ్యాన్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘట న మండల కేంద్రంలోని లింగమయ్య ఆలయ శివా రులో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన పాల వ్యాపారి, వ్యాన్‌డ్రైవర్ కొత్త నాగరాజు(32) ప్రతి రోజు బాల్కొండ మండల పరిధిలోని దుకాణాల్లో పాల ప్యాకెట్లను వ్యాన్‌లో సరఫరా చేస్తుంటాడు. ఆదివారం ఉదయం బాల్కొండ శివారులోని జాతీయ రహదారిపై ఆగిఉన్న డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.



నాగరాజు (ఫైల్)



వ్యాన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మృతదేహం